# చుట్టిల్లు

ప్రకాశం ఆ వీధంతా నాలుగైదుసార్లు తిరిగాడు. రాజాగారి భవనం కనబడలేదు.

''ఈ వీధి కాదా ?'' అనుకుంటూ మరొక వీధిలోకి వెళ్ళాడు. ఆవీధిలో కూడా, తను ఇరవై సంవత్సరాల క్రిందటచూసిన ఆ పెద్ద భవనం కనబడలేదు. నిరాశపడకుండా మళ్ళీ తను తిరిగి వచ్చినవీధికే వెళ్ళాడు. తను గతంలో చూసిన రాజాగారి పెద్దభవనం ఉన్న స్థలంలో కొత్తభవనం నిర్మాణమైంది కాని, ఆ వైభవమూ, ఆ ఠీవి ఆ సందడీ కనబడ లేదు.

''అయితే రాజాగారెక్కడున్నట్టు ?''

మళ్ళీ ఆవీధి చివరవరకూ వెళ్ళి ఒక యింటి యజమానిని రాజాగారిని గురించి అడిగాడు.

"ఏరాజాగారయ్యా ?"

"ఈ సంస్థానం రాజాగారండి"

"రాజా భీమారాయుడుగారా ? రెండు వీధుల తరువాత వెళ్ళి అడగండి."

ప్రకాశం కాళ్ళీడ్చుకుంటూ ఆ రెండువీధులూ కూడా దాటి పక్కసందులోకి వచ్చాడు.

"రాజాగారిది పెద్దభవనం. దాని ముందు పెద్దతోట, వాకిటిముందు పెద్ద కారు. ఇటూఅటూ పరుగులుతీసే నౌకర్లు, మూడు కుక్కలు. ఆవీధి రాజవీధిలా ఉండేది!" అనుకుంటూ అక్కడే నిలబడ్డాడు.

అప్పుడు గుర్తుకొచ్చింది- తనొక సందులోకి వచ్చినట్టు. ఆ సందు మొదట్లో ఒకాయన చుట్టకాల్చుకుంటూ మధ్య మధ్య బూడిదను వేలితో దులుపుతున్నాడు.

"రాజాగారు కొత్తభవనం కట్టుకున్నట్టున్నారు అది ఎక్కడుందో చెబుతారా ?" అడిగాడు.

ప్రకాశాన్ని పైనుంచి కిందివరకూ చూసి "మనదేఊరు ? ఈ ఊరు కానట్టుందే ?''

"మాది ఈ ఊరుకాదు. కాని చాలా రోజులక్రిందట ఒకసారి వచ్చాను."

''అట్లా చెప్పు, ఈ మధ్య జరిగిన సంగతులు నీకు తెలియవన్నమాట. ఈ సందు చివర ఉన్నదే రాజాగారిల్లు. చివరివరకూ వెళ్ళాలి."

ఆ సందు చివరన బంగాళాపెంకు కప్పిన చుట్టిల్లూ దానిచుట్టూ రెండు గజాల స్థలంవిడిచి పాతిన ముళ్ళకంచే, కర్రగేటూ కనబడ్డాయి. "ఇది రాజాగారిల్లా? ఇట్లా ఉందేమిటి ?'' అనుకుంటూ గేటు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు ప్రకాశం.

తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి సందుల్లోంచి చూస్తే పాత పడక్కుర్చీలో కూర్చుని ఆనాటి తెలుగువార్తాపత్రిక చదువుతున్న రాజాగారు కనబడ్డారు.

గంట పన్నెండయింది.

"తను భోజనంచేసి వచ్చాడు కాని, ఇది రాజాగారికి భోజనం వేళేమో ?" అనుకుంటూనే తలుపులు మెల్లగా తోశాడు.

"ఏమిట్రా ఇంత ఆలస్యం చేశావు ? ఇప్పుడు గంటెంతయిందో తెలుసా?" కేకలు వినబడ్డాయి లోపలినుంచి.

వెంటనే ప్రకాశం తలుపులు తెరుచుకుని లోపలికి వెళ్ళాడు. రాజాగారు తల ఎత్తి చూడగానే చేతులు జోడించాడు

రాజాగారు కనుబొమలు పైకెత్తి "ఎవరుబాబూ మీరు? మాకుఱ్ఱాడేమో ననుకున్నాను'' అన్నారు. ఆయనకు గుండెలో దడ ప్రారంభమయింది.

ఒకప్పుడు అడిగినవారికి లేదనకుండా దానధర్మాలు చేశారు. గొప్ప భాషాభిమాని, భాషాపోషకుడు. అనేకవిధాల గౌరవపురస్కారాలతో ఎంతోమంది పండితులను సంతృప్తిపరచిన చెయ్యి. ఇప్పటి పరిస్థితులలో ఎవరు వచ్చినా ముందు కాళ్ళూ చేతులూ ఒణుకుతాయి వాళ్ళను వట్టిచేతులతో పంపటమెట్లా అని.

''నా పేరు ప్రకాశమండి. సుమారు ఇరవై ఏళ్ళక్రితం తమ దర్శనం చేసుకున్నాను. మీ భవనంలో పెద్దగ్రంథాలయం ఉండేది. అపూర్వమైన గ్రంథాలెన్నో దానిలో చూశాను. వాటిలో కొన్నిటిని మీ భవనంలోనే కూర్చుని చదివాను. వారం రోజులపాటు ప్రతిరోజూ వచ్చేవాడిని. నాకు సెలవు అయిపోవటంచేత వెళ్ళిపోవలసి వచ్చింది. ఇప్పుడు నేను రిటైర్‌మెంటు తీసుకున్నాను. అందుకని ఆ గ్రంథాలు చదవాలన్న ఆశతో మళ్ళీ వచ్చాను" వినయంతో తలవంచాడు.

''ఒకప్పుడు నాకు అన్నిరకాల గ్రంథాలూ సేకరించాలన్న కొండంత ఆశా- వాటినన్నిటినీ చదివి జీర్ణించుకోవాలన్న ఉత్సుకతా ఉండేది. ఎన్నిటినో కొని గ్రంథాలయంలో చేర్చాను. కాని, పెద్దలనాటివే ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడు వాటిని చదవలేకపోయినా చూసుకుని సంతోషిస్తూ ఉంటాను. మీరు వాటి కోసం ఇంతదూరం వచ్చారంటే నాకెంతో ఆనందంగా ఉంది'' ప్రకాశం మాటలు వినగానే రాజాగారిలో అణగారిపోయిన ఉత్సాహం తిరిగి తలఎత్తినట్లయింది.

అంతలో కుర్రాడు కారియర్ తీసుకొచ్చాడు.

వెంటనే రాజాగారులేచినిలబడి "నేను భోజనంచేసివస్తాను. మీరు ఈ పరదా తొలగించుకుని షెల్ఫులలో ఉన్న గ్రంథాలనుచూసి తీసుకోండి. లేకపోతే ఈ పత్రిక చదువుకుంటూ ఉండండి. నేను పదినిమిషాలలో వస్తాను" లోపలికి వెళ్ళారు.

ప్రకాశం పరదా తొలగించుకుని అక్కడఉన్న షెల్ఫులవంక చూశాడు. నాలుగైదు నిలువెత్తు షెల్ఫులనిండా గ్రంథాలు పేర్చిఉన్నాయి. ఆ పక్కగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ, ఆ యింటిని పరిశీలనగా చూడనారంభించాడు. ఆ యింటికి ముందువెనకా దర్వాజాలున్నాయి. నాలుగుపక్కలా కిటికీలున్నాయి వెనకభాగంలో సగం భోజనం చెయ్యటానికి పడకకూ వీలుగా పరదాలుకట్టి ఉన్నాయి. ముందుభాగంలో సగం పుస్తకాల షెల్ఫులకూ, సగభాగం రాజాగారు పడక్కుర్చీలో దర్వాజా కెదురుగా కూర్చుని పత్రిక చదువుకోవటానికి అనువుగా పరదాలు కట్టిఉన్నాయి గాలికి పరదాలు ఎగిరినప్పుడు లోపలిభాగం కనబడుతూ ఉంటుంది. నేల ఏనాడు గచ్చుచేశారో అక్కడక్కడ పెళ్ళులులేచి గుంటలు పడ్డాయి. గోడలకువేసినసున్నం మాసిపోయినట్లుగా నల్లగా మరకలు మరకలుగా కనబడుతున్నది.

భోగభాగ్యాలతో ఓలలాడే జమీందారీ కుటుంబంలోపుట్టి, అరవై సంవత్సరాలు అతి వైభవంగా బ్రతికిన రాజాగారు ఈ మారుమూల-చేతిక్రింద నౌకర్లు లేక-పిలిస్తే పలికేదిక్కు-లేక-ఈ వయసులో ఒంటరిగా అతిదైన్యంతో ఈ చుట్టింట్లో గడపవలసివచ్చిందా? భోగయుతమైన జీవితం గడిపినవారికి బ్రతుకు ఎంత దుర్భరం?

జమీందారీలు పోయాయి. భరణాలు రద్దయ్యాయి. అప్పులకింద మిగిలిన ఆస్తి చెల్లయిఉంటుంది. దాని పర్యవసానమే ఈ పరిస్థితి కాబోలు.

రాజాగారిలో ప్రకాశం అదివరలో చూసిన ఠీవి వేషభాషలు కనబడలేదు. సామాన్యమైన ధోవతీ సగంచేతులషర్టూ రైతులువేసుకునే సామాన్యమైన చెప్పుల జత ఎదటమనిషిని గౌరవించి మాట్లాడటమూ-ఇవి చూసిన ప్రకాశానికి కళ్లు చెమ్మగిల్లాయి.

అంతలో భోజనం ముగించి వచ్చారు రాజాగారు.

"పత్రిక చదివారా?"

"లేదండీ పుస్తకాల పేర్లు చూస్తున్నాను" దిగ్గునలేచి నిలబడ్డాడు.

"గ్రంథాలు చదవాలని ఇంతదూరంవచ్చి పేర్లుచూస్తున్నారా? పత్రికయినా చూడలేదూ?" అంటూ నిలబడిపోయారు రాజాగారు. ప్రకాశం ఒంటరిగా కూర్చుని దేనినిగురించి ఆలోచించి ఉంటాడో రాజాగారు గ్రహించినట్టుగా ఆయన ముఖంలో రంగులు మారాయి.

తన మనోగతం రాజాగారికి తెలిసిపోయినట్టుందని ప్రకాశం తల వంచుకున్నాడు.

ఎంత కాలానికో, గ్రంథాలపట్ల ఆసక్తిగలవ్యక్తి ఎదురయ్యాడన్న సంతోషంతో, గబగబా భోజనంచేసిన రాజాగారు-అతడితో కాళిదాసు కావ్యాలనుగురించీ, కవిత్రయం వారి రచనారీతులనుగురించి చర్చించాలని ఆశించారు. వక్కపలుకు నోట్లో వేసుకుంటూ ఇంతమంచి అవకాశాన్ని అభిజాత్యంకోసం జారవిడుచుకో దలచలేదు. ఎంతమందికో పరిస్థితులుమారాయి. వారందరిలో తానొకరు అనుకుని ఆయన అతికష్టమ్మీద సర్దుకోగలిగారు.

''ఇంతకూ మీరు అప్పుడు ఏఏ గ్రంథాలు చదివారు? ఇప్పుడేం చదవాలను కున్నారు?'' అంటూ సంభాషణను బాటలోకి తిప్పారు.

ప్రకాశం మనసులో కమ్ముకున్న మేఘాలు తేలిపోయాయి. రాజాగారితో సాహిత్యపరంగా చర్చిస్తూ, మధ్య మధ్య ఆయన ముఖకవళికలు గమనించి ప్రస న్నంగా ఉండటంచూసి కాస్త ధైర్యం తెచ్చుకోగలిగాడు. రాజాగారి మారిన పరిస్థి తులను అంచనా వేయటానికి తను ఎంతటివాడని? తొందరపాటనిపించుకోదూ? తన తెలివితక్కువతనానికి సిగ్గుపడ్డాడు.

క్రమంగా ఇష్టాగోష్ఠిలోకి దిగింది చర్చ.

"ఇవాళమీతో మాట్లాడుతూఉంటే నాకు ప్రాణం లేచివచ్చినట్టుగాఉంది. నాకు తండ్రిలేనిలోటు తెలియకుండా నా తల్లి నన్ను అబ్బురంగా పెంచింది. ఇల్లు కదలనవసరం లేకుండా ఇల్లే పాఠశాలగా చదివించింది. ప్రైవేటుగాచదివి పట్ట భద్రుడినయ్యాను. ఎక్కడెక్కడి గ్రంథాలూ తెప్పించి గురుముఖంగా చదువు కున్నాను. పెద్దలనాటి గ్రంథాలు అనేకంగాఉన్నాయి. వాటినన్నిటినీ చదవాలంటే ఈ జీవితకాలం చాలదు.''

"చాలదు కాని పిపాస అనేది ఊరుకోనివ్వదు"

''అలా అనుకునే నాదగ్గరికివచ్చిన పండితులతో వాటినిగురించి చర్చలు జరిపించేవాడిని.''

"నేను ఎరుగుదును"

''మీరు విన్నారా? అంత గొప్ప పండితులను వట్టిచేతులతో పంపబుద్ధి పుట్టేదికాదు. పాండిత్యం అందరికీ అబ్బుతుందా? అది దైవమిచ్చినవరం. వారు తమ జీవితమంతా కృషిచేసి దానికి మెరుగులు దిద్దుకున్నారు'' అంతలోకి ఏమా లోచన మనసులో మెదిలిందో కళ్లు మూసుకున్నారు కొద్దిసేపు.

"మళ్ళీ రాజాగారికి ఏంజ్ఞాపకం వచ్చిందోపాపం. ఇదంతా నారాకవల్ల ఆయన మనసు కలతపడుతోందనుకుంటాను" నొచ్చుకున్నాడు ప్రకాశం.

రాజాగారు కొంతసేపటికి తేరుకుని "ఇప్పుడు నాదగ్గరికి ఎవరూరారు. ఎందుకంటారేమో? నేనిప్పుడు జమీందారునికాను. కనుక పండితులురారు. బంధు

వులూ ఆశ్రితులూ దూరమయ్యారు. గొప్ప జమీందారిణిగా బ్రతికిన నా భార్య లేమిని ఎదుర్కోలేక గుండెపోటుతో మరణించింది. అప్పుల బాధవల్ల ఆ భవనం కారు అమ్మేశాను. నౌకర్లందరినీ తొలగించాను. కుక్కలను అడిగినవారికిచ్చేశాను. మిగిలినడబ్బు అతిస్వల్పము. అది బ్యాంకిలో పెట్టి కావలసినప్పుడు తీసుకుంటు న్నాను. ఇదిగో-ఈ చుట్టిల్లుఉన్నదే-కోనసీమనుంచి ఒక వేదపండితుడిని పిలిపించి దీనిలోఉంచుదామని కట్టించాను. సత్కాలక్షేపమంటే ప్రాణంకొట్టుకుపోతుందినాకు. వేదాలు అభ్యసించాలనుకున్నాను. ఉపనిషత్తులు పఠించాలనుకున్నాను. వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపానుకూడా"

"కోనసీమలో చాలామంది వేదాలూ పనసలూ వల్లించే శిష్యవర్గంగల ఘనా పాఠీలు ఇంకాఉన్నారు."

''ఉన్నారు కాని-నాకా అదృష్టం ఉంటేకదా? దరిద్రుడికి ఆశలు పుడుతూ ఉంటాయి. అవితీరకుండానే అంతరిస్తూఉంటాయి నావనీ అంతే అయింది."

"మీరు ప్రతిరోజూ భోజనంచేసి విశ్రాంతి తీసుకోవాలి. నేనిక్కడే కూర్చుం టాను. మీరు కాసేపు విశ్రమించండి" మాట మార్చాలనిచూశాడు ప్రకాశం.

''ఇవాళ విశ్రాంతి తీసుకోవాలనిలేదు. ఇంతకాలంనుంచీ మాట్లాడే మనిషి కోసం ముఖం వాచిపోయాను. మీరు కనబడ్డారు. ఇంకా విశ్రాంతి అక్కర్లేదు. ఇంతకుముందు రోజూ ఈ పుస్తకాలనుచూస్తూ నాలోనేనే సంతోషపడుతూ ఉండే వాడిని. దృష్టిమందగించి సరిగా కనబడటంలేదు''

"కళ్ళ డాక్టరికి చూపించకపోయారా?" నాలుకకరచుకున్నాడు ప్రకాశం తన సూచనకు.

"వెళ్లాలి కాని-ఏమిటో అశ్రద్ధచేశాను. అదీ కాక-తగిన హంగులేదు'' అన్నారు ముఖం పక్కకు తిప్పుకుని.

ప్రకాశం ఏంమాట్లాడలేకపోయాడు.

"అందుకని ఇప్పుడేంచేస్తున్నానంటే పుస్తకాలను తడిమిచూసుకుని ఆనం దిస్తున్నాను.'' ఆయన గొంతులోజీర.

"అన్నిటికీ ఉపాయాలుంటాయి రాజాగారూ! మీరు అలా విచారపడకండి."

''నన్ను రాజాగారని పిలవకండి'' కొంచెం కఠినంగాఉందా కంఠస్వరం?

''అయితే అలా పిలవనులెండి బాబుగారూ మీరలా కుర్చీలో కూర్చుంటే నేను చదివి వినిపిస్తాను. ఏంచదవమంటారు?''

"ఎంతగతి పట్టింది? అనుకుని ఇవాళ్టికి కబుర్లతోనే కాలక్షేపం చేయాల నుంది."

"అలాగే. కాని—మీకు భారతంలో ఏ ఘట్టం ఇష్టం చెప్పండి. రేపు చదవ టానికి తీసి ఉంచుతాను. నేను చదువుతూ ఉంటే మీరు విందురుగాని."

"రేపటికి కదా? అంతవరకూ చెప్పలేకపోతానా? భారతంలో ఏది కావాలను కుంటే అది దొరుకుతుంది. ఈర్ష్యాసూయలు ఎందుకు పుడతాయో- కోపతాపాలు ఎలా కస్సుబుస్సుమంటూ పైకి లేస్తాయో- మానవులు ఒకరిమీద ఒకరు కక్షలూ కార్పణ్యాలూ ఎలా పెంచుకుంటారో - ఒకరిమీద ఒకరు ఎలా తీర్చుకుంటారో- రాజ్యకాంక్ష—అధికార కాంక్షలకోసం ఎంత వంచన ఎంత మోసం చేస్తారో వగైరాలన్నీ వివరంగా తెలుసుకోవచ్చు. ఎవరికి కావలసింది వాళ్లు నేర్చుకోవచ్చు. అంతేనంటారా?"

అవే కాదు. ఇంకా ఉన్నాయి కదా. వాటికి సరియైన దండన కూడా ఉంది కదా."

''ఉంది. కాని అ యుద్ధంలో ఎంతమంది అమాయకులు లేగదూడల్లా నలిగిపోయారు? ధననష్టం జననష్టం ఎంత జరిగింది? ఇంకా అప్పుడు బాంబులు లేవు, యుద్ధభూమి వరకే అస్త్రశస్త్రాలు పరిమితం. యుద్ధనీతిని ఇరుపక్షాలూ పాటించటం జరిగింది. అయినా హద్దులుమీరిన సందర్భాలు లేకపోలేదు."

"దుష్టశిక్షణ శిష్టరక్షణ జరిగింది. అన్యాయానికి మొదట గెలుపూ తరువాత ఓటమి. న్యాయమే స్థిరంగా చివరకు నిలిచేది. దానికి పట్టుదలా, ఓరిమీ కావాలి."

"రాజాగారికి కాఫీవేళయినట్టుంది. కుర్రాడు కాఫీ ఫ్లాస్కు, గ్లాసు తెచ్చి ముందర పెట్టాడు.

"మీరు కూడా తీసుకోండి"

"నేను కాఫీ వదలిపెట్టాను"

"ఎందుకని ?"

"మొదటినుంచి నా భార్య కాఫీచేసి తెచ్చియిచ్చేది ఇప్పుడామె లేదు. అందుకని వదలిపెట్టాను."

ఆ మరునాడు రాజాగారి విశ్రాంతి సమయం దాటిన తరువాత ఆయన అనుమతితో ప్రకాశం భారతంలో ఒక ఘట్టాన్ని తీసుకుని చదవటం మొదలు పెట్టాడు. కొంత చదివి రాజాగారి ముఖంలోకి చూశాడు. ఆపాలనిపించింది.

"ఆపేరెందుకు? చదవండి"

''మీకు నచ్చినట్టు లేదు. అందుకని ఆపేను.

"ఓ-అదా? పద్యం ఎలా చదవాలంటే ఆయా రాగచ్ఛాయలతో భావ యుక్తంగా చదవాలి. కాని రాగం ఎక్కువ తీయకూడదు. మనం చదివేది రాగం కోసం కాదు. అప్పుడే వినసొంపుగా ఉంటుంది" అంటూ రెండు పద్యాలు చదివి వినిపించారు.

ఆశ్చర్యపోయాడు ప్రకాశం.

"బాబుగారూ అద్భుతం - అత్యద్భుతం. మీరు చదివిన పద్ధతిలో వినటం ఇదే మొదటిసారి. ఈనాటినుంచీ మీరు నాకు శిక్షణ యివ్వాలి."

రాజాగారి ముఖం వికసించినట్టయింది. తనకొక శిష్యుడు దొరికినందుకు ఆయనలో ఉత్సాహం పెల్లుబికింది.

పదిరోజుల తరువాత ప్రకాశాన్ని రాజాగారు మళ్ళీ భారతం చదవ మన్నారు.

జంకుతూ చదివాడు.

"ధోరణి దారినపడ్డది. ఇలా చదువుతూ ఉంటే అదే అలవాటవుతుంది."

అప్పటినుంచీ ప్రకాశం చదువుతూ ఉంటే రాజాగారు పడక్కుర్చీలో కూర్చుని వింటూ ఉండేవారు అరమోడ్పు కళ్ళతో.

ఒకనాడు ప్రకాశం హోటల్లో భోజనం చేసేటప్పుడు లయన్సుక్లబ్బు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించుతున్నదని విన్నాడు. భోజనం కాగానే ఐ కాంపు ఎక్కడఉన్నదో వెళ్ళి వివరాలన్నీ సేకరించాడు. ప్రకాశం రాజాగారిని గురించి చెప్పాడు.

"ఈ కాంపు పేదవాళ్ళకొరకు నిర్వహింపబడుతోంది. రాజాగారు వస్తే ప్రత్యేక వసతులు ఏర్పాటుచేస్తాం" అన్నాడు డాక్టరు,

"రాజాగారికి ఇప్పుడు కారు లేదు."

"దగ్గరే కదా. నా కారులో తీసుకువస్తాను. వారికే ముందు ఆపరేషన్ చేసి గదిలో ఉంచుతాము. మరునాడు కారులో దింపుతాము. రాత్రికి మీరు దగ్గరుండ వచ్చు" డాక్టరు చెప్పాడు.

"రాజాగారికి ఒకరోజు ముందరే ఈ సంగతి ప్రకాశం చెప్పాడు.

రాజాగారు విని ఊరుకున్నారు.

"మళ్ళీ ఇటువంటి అవకాశం దొరకదు బాబుగారూ!" ప్రాధేయపడ్డాడు.

"చూద్దాం. అయినా నాకు దృష్టి సరిగా లేకపోయినా మీరు చదివి వినిపిస్తున్నారు కదా?"

"ఆపరేషన్ చేసిన తరువాత మీ కనుదృష్టి మెరుగవుతుంది. మీరు చదువుకోవచ్చు. నేనూ చదువుతాననుకోండి. దయచేసి ఒప్పుకోండి.

రాజాగారు మాట్లాడకపోయేసరికి ఒప్పుకున్నట్లేనని డాక్టరుకు చెప్పి మరునాడు ఆపరేషను చేయించాడు ప్రకాశం. ఆ రాత్రికి అక్కడే రాజాగారి మంచం దగ్గరగా పడుకున్నాడు. తెల్లవారిన తరువాత డాక్టరు కన్ను చూసి రెండునెలలు ఈ మందుచుక్కలు కంటిలో వేసి కంటికి దెబ్బతగలకుండా చూడండి. రెండు నెలలయిన తరువాత మేము మళ్ళీ వస్తాము. అప్పుడు కన్ను చూసి అద్దాలకు

నెంబరు రాసిస్తాను. ఈలోపల నల్లకళ్ళద్దాలు వాడండి" అంటూ రాజాగారిని ఇంటిదగ్గర దింపి నమస్కరించాడు డాక్టరు.

తను ఇచ్చిన రెండువందల రూపాయలు డాక్టరు చూపిన మర్యాదకు చాలదనుకున్నాడు ప్రకాశం. అయినప్పటికీ తన శక్తికి తగినట్టు రాజాగారికి అపరేషను విజయవంతమయిందన్న తృప్తి కలిగింది. శ్రద్ధగా అయనకు కంటిలో మందుచుక్కలు రెండుపూటలా వేసేవాడు. కన్ను నలుపుకోకుండా అయనను హెచ్చరించేవాడు. రెండు నెలల తరువాత డాక్టరు వచ్చి చూశాడు.

రాజాగారిచేత చదివించి చూసి కంటి అద్దాలకు రాసి యిచ్చాడు. డాక్టర్ని సాగనంపుతూ ఆయనకు ఫీజు చేతిలో పెట్టాడు ప్రకాశం. ఆరోజే బజారుకువెళ్ళి రెండు కళ్ళజోడు ఫ్రేములు తీసుకువచ్చి రాజాగారికి పెట్టి చూశాడు. నల్లటి అద్దాలను ఆయనకు సరిపడిన ఫ్రేములో బిగించమని నెంబరు ఇచ్చి వచ్చాడు ప్రకాశం.

కళ్ళజోడు ఇంటికి తీసుకువచ్చిన తరువాత రాజాగారేమంటారోనని జంకుతూనే ఆయనకు కళ్ళజోడు పెట్టేశాడు.

దానికీ రాజాగారు మౌనం వహించారు.

కుర్రాడు మళ్ళీ రాలేదు. రోజూ ప్రకాశమే టిఫిన్‌కారియరూ, కాఫీప్లాస్కు తీసుకువస్తున్నాడు. రెండురోజుల తరువాత "నౌకరు కుర్రాడు రావటంలేదు. ఇంకనుంచీ నేను భోజనానికి వచ్చినప్పుడే రాజాగారికి కూడా తీసుకువెళ్తాను" అన్నాడు ప్రకాశం సర్వరుతో.

"కుర్రాడికి రెండు నెలలనుంచీ జీతం లేదట. వాడు ఊరికి వెళతానని చెప్పి వెళ్ళాడు" సర్వరు చెప్పాడు.

''కారియర్‌కీ, కాఫీకి బిల్లు ఇచ్చారా?''

''లేదండి. మూడురోజుల కిందటే కారియర్‌కీ కాఫీకీ సరిపోయింది రాజాగారిచ్చిన డబ్బు.''

"మిగిలింది నా బిల్లులో కలపండి. నేను నెలనెలకూ తెచ్చిస్తాను."

రాజాగారి పనులన్నీ యథాప్రకారం ప్రకాశమే చేస్తున్నాడు. ఆయన కుర్రాడిని గురించి అడిగినప్పుడల్లా "ఊరికెళ్ళాడట" అని చెప్తూ వచ్చాడు.

రెండురోజులనుంచీ రాజాగారు సరిగా భోజనం చేయటంలేదు. కాఫీ వద్దంటున్నారు, చేతికిచ్చినా కళ్ళజోడు పెట్టుకోవటంలేదు. ప్రకాశం పుస్తకం చదువుతున్నప్పుడు ఆదివరకు కలిగే ఆనందం ఇప్పుడాయన ముఖంలో కనబడటం లేదు. ప్రకాశం మనసు తల్లడించిపోయింది. వెంటనే ఒక డాక్టర్ని తీసుకువచ్చి చూపించాడు.

"జబ్బేమీలేదు. బలహీనంగా కనబడుతున్నారు. మంచి ఆహారం, పళ్లూ, పాలూ తీసుకుంటే బాగుంటుంది'' పరీక్షచేసి చెప్పాడు డాక్టరు.

'బాబుగారికిది మానసికమైనదికాని శారీరకమైనది కాదు. ఇప్పుడు నేనేం చెయ్యాలి?' ప్రకాశం మనసు అల్లకల్లోలమై పోతోంది.

కులాసాగా కబుర్లుచెబుతూ మధ్యమధ్య నవ్విస్తూ ఆసక్తికరమైన ప్రశ్నలు వేస్తూ కావాలనిచెప్పి చదివించుకుని ఆనందించే రాజాగారు ఒక్కసారి క్రుంగిపోయారెందుకని?

బ్యాంకిలో డబ్బయిపోయిందనా ?

తనను ఎవరో పోషిస్తున్నారన్న అభిమానమా ?

రాజాగారు ఆనాడు కూడా కాఫీ తాగనని పట్టుబట్టారు. అంతకుముందు "భాగవతం ఏడురోజుల్లో చదివి ముగించగలరా? వినాలనిఉంది" అని అడిగారు.

'ఎందుకలా అడుగుతున్నారు. పరీక్షన్మహారాజు అడిగినట్టు?"

"పోనీ గజేంద్రమోక్షం చదవండి వింటాను''

''చదువుతాను. కాని మీరు కాఫీ తాగి కంటికి జోడు పెట్టుకుంటే చదువుతాను'' రాజాగారిదగ్గర ఏర్పడిన చనువుకొద్దీ అన్నాడు.

ఆయన కాఫీ తాగుతానని నోటితో చెప్పలేదు. కాని ప్రసన్నవదనంతో ప్రకాశంవంక చూశారు.

ప్రకాశం వెంటనే కళ్ళకు జోడు తగిలించి, చిన్న పిల్లవాడికి తాగించి నట్టుగా ఒక చేత్తో తలపట్టుకుని మరొకచేత్తో గ్లాసు పట్టుకుని కాఫీ తాగించాడు రాజాగారికి.

గజేంద్రమోక్షంలోని పద్యాలు ప్రకాశం చదువుతూంటే రాజాగారు ఒక పక్క కన్నీళ్లు కారుతుండగా కళ్ళుమూసుకుని చేతులు జోడించి తల ఊపుతూ వింటున్నారు.

"ఇంకా ఎన్ని పద్యాలున్నాయి? 'సిరికించెప్పడు' పద్యానికి తొందరగా రండి" ఆత్రంగా అడుగుతున్నట్టుందామాట.

"తరువాత వచ్చే పద్యం అదే, చదువుతున్నాను-వినండి"

అతడా పద్యం చదువుతుంటే ఆయన దేహం పరవశించినట్లయింది. ఆనం దాన్ని పట్టలేక దిగ్గున లేచి ప్రకాశాన్ని కౌగలించుకుని "నాకు ఎంతగానో ఉప చారాలు చేశారు. నేను శారీరకంగా మానసికంగా ఆరోగ్యవంతుణ్ణి కావటానికి ఎంతో కష్టపడ్డారు. పసిపిల్లవాడిని కనిపెట్టి చూస్తున్నట్టు చూస్తున్నారు. ఈ పద్యం చదివి నాకు గజేంద్రుడికి కలిగినంత సంతోషాన్ని కలిగించారు. మీరె ప్పుడూ ఇక్కడే ఉండి నాకు ఇలాగే చదివి వినిపించాలి. నాకు మిగిలినవి ఈ చుట్టిల్లూ, ఈ గ్రంథాలూ. ఈ సంపద మీకు రాసిస్తున్నాను స్వీకరించండి. నాకు వేరే వారసులు లేరు. అందుకే మిమ్మల్ని ఎన్నుకున్నాను నా వారసుడిగా" అన్నారు గద్గదస్వరంతో.

"బాబుగారూ నేను మీకు వారసుడినా? మీ దగ్గరుండి సేవలుచేస్తూ మనసు శాంతింపచేసుకోవాలన్న ఆవేదనతో వచ్చినవాడిని. నేను అమితంగా ప్రేమించిన భార్య చనిపోయింది. ఆమెకు నేను వైద్యోపచారాలు సరిగా చేయలేకపోయాను. చాలీచాలని జీతంతో ఇంకెంతకాలం బాధపడటమని వాలంటరీ రిటైర్మెంటుకు దరఖాస్తు పెట్టాను. ఆమె చనిపోయిన తరువాత రావలసిన డబ్బు చేతికంది జేబు నిండింది. నా భార్యను బ్రతికించటానికి ఉపయోగపడని ఆ డబ్బు తీసుకుని నాకు అత్యంతానందాన్ని కలిగించే పని ఏదయినా చేయాలని ఇంటినుంచి బయలుదే రాను. నా ఆవేదన మీ సాంగత్యంలో ఉపశమించింది. సత్కాలక్షేపం జరుగు

తోంది. నన్నిట్లా రోజులు గడపనీయండి.'' రాజాగారిని కుర్చీమీద కూర్చోబెట్టి తువాలతో ముఖం తుడిచి పాదాలకు నమస్కరించాడు.

''చూడండి, నేను ఎప్పుడూ మాటతప్పి ఎరుగను. అదే కాదు- నా మాటకు తిరుగు కూడా లేదు" రాజాగారి మాటలు గంభీరంగా వినబడ్డాయి.

"బాబుగారూ మీమాటకు తిరుగులేదు. సరే-మరి- నేను చిన్నవాడిని. మీకు వారసుడినంటున్నారు. నన్ను 'మీరు మీరు' అనటం భావ్యమా ? చెప్పండి."

"సరే సరే, నీయిష్టం వచ్చినట్టే పిలుస్తాను.''

ఆరోజు పురాణకాలక్షేపం ఈ రకంగా ముగిసింది.

పదిరోజులు ఏవిధమైన మార్పు లేకుండా దినచర్య సాగిపోయింది.

ఒకనాడు రాజాగారు పావుగంట ఆలస్యంగా లేచారు.

ప్రకాశం అప్పటికి ఆయనకు కావలసినవన్నీ తయారుచేసి నాలుగుసార్లు ఆయన పక్కచుట్టూ తిరిగాడు.

కొంతసేపటికి రాజాగారు బద్ధకంగా ఆవలిస్తూ లేచారు.

''ఏమిటి ఇవాళ ఇంత బద్ధకంగా ఉన్నారు? లేచి ముఖం కడుక్కొని కాఫీ తీసుకోండి.''

ఆయన ముఖం కడుక్కునే వరకూ ఎదురుగా నిలబడి, కాఫీ తాగించాడు.

"స్నానానికి నీళ్ళు కాగబెట్టాను. మీకేమో బద్ధకంగా ఉంది. నేను స్నానం చేయిస్తాను రండి'' రాజాగారిని స్టూలుమీద కూర్చోబెట్టి సబ్బుతో ఒళ్ళురుద్ది వేడి వేడి నీళ్ళు చెంబులతో ఆయన 'చాలు చాలు' అనేవరకూ పోశాడు. ఒళ్ళు తుడిచి బట్టలు వేశాడు.

''ఎంతకాలమయిందో నేనిలా స్నానం చేసి ? అబ్బ ! ఎంత హాయిగా ఉంది ?'' అంటూ రాజాగారు పడక్కుర్చీలో కూర్చుని పత్రిక చేతబట్టారు.

ప్రకాశం పదిరోజులనుంచీ హోటల్ భోజనం బాగాలేదని వస్తుసామగ్రి కొని తెచ్చి ఇంట్లోనే వంట, కాఫీ చెయ్యటం మొదలుపెట్టాడు.

"బాబుగారూ, నాచేతి వంట ఎలా ఉంది ? నాకు వంటచెయ్యటం కొద్దిగా వచ్చు."

రాజాగారు నవ్వుతూ ''అశాస్త్రంలో కూడా ప్రావీణ్యత ఉందా ?" నవ్వు కుంటూ భోజనం చేశాడు.

"నేను ఇలాంటివంట ఎప్పుడూ రుచిచూడలేదు. కాని ఈ రుచి చాలా కమ్మగా ఉంది" అంటూ తృప్తిగా భోజనం చేశారు.

"మనం ఇంట్లోనే వంటచేసుకుంటే బాగుంటుందనిపించి చేస్తున్నాను గాని మీకు నచ్చుతుందో లేదోనని శంకిస్తున్నాను" అంటూ రోజుకొక రకంగా వంటచేసి రాజాగారిని మెప్పిస్తున్నాడు. ఆయన మెచ్చుకుంటున్న కొద్దీ ఉత్సాహం ఇనుమ డించటం మొదలుపెట్టింది.

ప్రకాశం ఆ యింటికి వచ్చిన తరువాత ఇంటిచుట్టూ తవ్వి పూలమొక్కలు నాటి నీళ్ళుపొయ్యటం మొదలుపెట్టాడు. అవి పెరిగి మొగ్గతొడిగి పూలు పూసి సువాసనలు వెదజల్లుతూ ఉంటే "ఏమిటోయ్, మన యింట్లోకి సువాసనలు వస్తున్నాయి ?'' ప్రశ్నించారు రాజాగారు.

"కొంచెం ఒళ్ళు వంచినట్లవుతుందని ఇంటిచుట్టు పూలమొక్కలు వేశాను. మీకు నచ్చిందా వాసన ?"

"నచ్చటమా ? హాయిగా ఉంటేను? నీవు అన్నిటిలో ఉన్నావనిపిస్తున్నావు. మరిచిపోయిన సుఖాలను నాకు మళ్ళీ అలవాటు చేస్తున్నావు."

''నా ధ్యేయమే అది. మరీ మెచ్చుకోకండి. నాఒళ్ళు ఉబ్బిపోతుంది.''

నాలుగు నెలలపాటు రాజాగారు తమ చివరిదశలో "ఎంతసుఖంగా ఉంది?" అనుకుంటూ ప్రకాశం శుశ్రూషతో నవ్వులు వెదజల్లుతూ గడిపి ప్రశాంతంగా నిద్రలోనే కన్నుమూశారు.

వారసుడిగా ప్రకాశం తన విధులను నిర్వర్తించాడు.

రాజాగారు అలవాటుగా కుర్చీలో కూర్చుని ప్రకాశం చదువుతుంటే వింటు న్నట్టుగా ఆయన ఫొటో బైటికితీసి కుర్చీలోపెట్టి పూలహారం వేసి దానికెదురుగా

కూర్చుని గ్రంథపఠనం చేస్తున్నాడు ప్రకాశం ఇప్పుడు. అయినా ఒంటరి తన మనిపిస్తోంది. బిక్కు బిక్కు మంటూ ఆ యింట్లో మెదలలేకపోతున్నాడు.

అయినా పితృతుల్యుడైన రాజాగారి ఆజ్ఞను ఉల్లంఘించలేడు. ఆయన ఉన్నప్పుడు "ఇవాళ ఏంచదవమంటారు ?" అని అడిగినట్లే ఆ ఫోటోవంక మధ్య మధ్య చూస్తూ చదువుతూ ఉంటాడు ప్రకాశం.

